మన్నె క్రిశాంక్ కేసు విచారణ నిలిపివేత

- కింది కోర్టుకు హైకోర్టు ఆదేశం
- తదుపరి విచారణ ఫిబ్రవరి 4కు వాయిదా

నాంపల్లి క్రిమినల్ కోర్టులు, జనవరి 30 (నమస్తే తెలంగాణ): బీఆర్ఎస్ నాయకుడు మన్నె క్రిశాంక్‌పై నమోదుచేసిన సోషల్ మీడియా కేసులో రాష్ట్ర ప్రభుత్వానికి చుక్కెదురైంది. ఈ కేసు విచారణను కొనసాగించరాదని హైకోర్టు కిందిస్థాయి కోర్టును ఆదేశించింది. రేవంత్‌రెడ్డి ప్రభుత్వానికి వ్యతిరేకంగా మన్నె క్రిశాంక్ సామాజిక మాధ్యమాలలో పోస్టులు పెట్టారంటూ టీపీసీసీ కోఆర్డినేటర్ తిరుమల వెంకటేశ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు సైబర్ క్రైం పోలీసులు ఈ నెల 18న కేసు నమోదు చేశారు. రేవంత్‌రెడ్డితోపాటు ఆయన కుటుంబ సభ్యులపై అనుచిత వ్యాఖ్యలు చేస్తూ సోషల్ మీడియాలో పోస్టులు పెట్టిన ట్టు ఆరోపించారు. ఈ ఫిర్యాదుపై పోలీసులు బీఎన్ఎస్ సెక్షన్లు 352, 353(1)(బీ) కింద కేసు నమోదు చేశారు. పోలీసులు తనను అరెస్టు చేసే అవకాశం ఉండటంతో క్రిశాంక్ హైకోర్టును ఆశ్రయించారు. ఆయన దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ జరిపిన జస్టిస్ విజయ్‌సేన్‌రెడ్డి ధర్మాసనం మధ్యంతర ఉత్తర్వులు జారీచేసింది. తదుపరి ఉత్తర్వులు వెలువడే వరకూ ఈ కేసు విచారణను నిలిపివేయాలని 12వ అదనపు చీఫ్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ కోర్టును ఆదేశించింది. తదుపరి విచారణను ఫిబ్రవరి 4కు వాయిదా వేస్తూ హైకోర్టు ఆదేశించింది.

వక్ఫ్ బోర్డు సీఈవోను తొలగించండి

హైకోర్టు కీలక తీర్పు

హైదరాబాద్, జనవరి 30(నమస్తే తెలంగాణ): రాష్ట్ర వక్ఫ్‌బోర్డు సీఈవోను తక్షణమే తొలగించాలని హైకోర్టు ప్రభుత్వాన్ని ఆదేశించింది. నాలుగు నెలల వ్యవధిలోగా అర్హుడైన అధికారిని పూర్తిస్థాయి సీఈవోగా నియమించాలని స్పష్టంచేసింది. రాష్ట్ర ప్రభుత్వంతోపాటు రాష్ట్ర వక్ఫ్‌బోర్డుకు ఆదేశాలు జారీ చేసింది. వక్ఫ్ చట్టం-1995లోని సెక్షన్ 23 ప్రకారం వక్ఫ్ ప్రస్తుత సీఈవో నియామకం జరగలేదని తప్పుపట్టింది. వక్ఫ్ బోర్డు ఎండీ అసదుల్లాను తక్షణమే పూర్తిస్థాయి చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ పదవి నుంచి తొలగించాలని న్యాయమూర్తి జస్టిస్ నగేశ్ భీమపాక గురువారం ఉత్తర్వులు జారీచేశారు. ఈసీవో నియామకం నిబంధనలకు విరుద్ధమని అన్నారు. తాత్కాలిక సీఈవోగా షేక్ లియాకత్ హుస్సేన్‌ను కొనసాగించవచ్చని వెల్లడించారు. కొత్త సీఈవో నియామకం వక్ఫ్ బోర్డు చట్టంలోని సెక్షన్ 23కు లోబడి ఉండాలని స్పష్టంచేశారు. గోల్కొండకు చెందిన మహ్మద్ అక్బర్ దాఖలు చేసిన కోర్టు ధిక్కార పిటిషన్‌పై విచారణ సందర్భంగా హైకోర్టు ఈ ఉత్తర్వులను జారీచేసింది. అడిషనల్ కలెక్టర్ హోదాలో ఉన్న అసదుల్లా వక్ఫ్ బోర్డు సీఈవోగా కొనసాగేందుకు అవసరమైన అర్హతలు లేవని పిటిషనర్ వాదించారు. అసదుల్లా స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టరని, ప్రభుత్వ డిప్యూటీ సెక్రటరీ స్థాయి కంటే తక్కువ హోదాతో ఉన్నారని, ఆయన నియామకం వక్ఫ్ చట్టంలోని సెక్షన్ 23కు అనుగుణంగా లేదని చెప్పారు. ముస్లిం అధికారులు తగిన సంఖ్యలో లేనందున 35 ఏండ్లపాటు ప్రభుత్వ సేవ లందించిన ప్రస్తుత ఎండీ అసదుల్లాను సీఈవోగా నియమించేందుకు ఆమోదం తెలిపామన్న వక్ఫ్ బోర్డు వాదనలను హైకోర్టు తోసిపుచ్చింది.

'స్థానిక' ఖాళీలకు ఎన్నికలపై కౌంటర్ వేయండి

రాష్ట్రానికి హైకోర్టు ఆదేశం

హైదరాబాద్, జనవరి 30 (నమస్తే తెలంగాణ): స్థానిక సంస్థల్లో ఖాళీగా ఉన్న పదవులకు ఎన్నికలు నిర్వహించాలంటూ దాఖలైన పిటిషన్‌పై ప్రభుత్వం కౌంటర్ పిటిషన్ దాఖలు చేయాలని గురువారం హైకోర్టు ఆదేశించింది. రాష్ట్ర ప్రభుత్వం మూడు వారాల్లో కౌంటర్ దాఖలు చేయాలని, దీనిపై పిటిషనర్‌కు ఏమైనా అభ్యంతరాలు ఉంటే వాటిని క్రోడీకరిస్తూ రెండు వారాల్లో కౌంటర్ దాఖలు చేయాలని పిటిషనర్‌ను ఆదేశించింది. తదుపరి విచారణను మార్చి 5కు వాయిదా వేస్తూ తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సుజోయ్ పాల్, జస్టిస్ రేణుకయారా ఉత్తర్వులు జారీ చేశారు. ఖాళీగా ఉన్న స్థానిక సంస్థల కు ఎన్నికలు నిర్వహించడం లేదంటూ 2023, మార్చిలో ప్రజాప్రయోజన వ్యా జ్యం దాఖలైంది. వేర్వేరు జిల్లాల్లోని 220 సర్పంచ్ పదవులకు, 94 ఎంపీటీసీ, నాలు గు జడ్పీటీసీ, 5,364 గ్రామ వార్డులు, 344 ఉపసర్పంచ్ స్థానాలు ఖాళీగా ఉన్నాయని పిల్‌లో పేర్కొన్నారు. వీటికి ఎన్నిక లు నిర్వహించకపోవడంతో ఆయా పంచాయతీలు, వార్డులు ప్రజాప్రతినిధుల ద్వారా వచ్చే నిధులను కోల్పోతున్నాయని తెలిపారు.

భుజంగరావు, రాధాకిషన్‌కు బెయిల్

- ఫోన్‌ట్యాపింగ్ కేసులో ఊరటనిచ్చిన హైకోర్టు
- 10 నెలలుగా జైలులో ఉన్న నిందితులు
- కట్టు కథలతో కేసులో ఇరికించారు : న్యాయవాది

హైదరాబాద్, జనవరి 30 (నమస్తే తెలంగాణ): పలువురు విపక్ష నేతలతోపాటు న్యాయమూర్తులు, ఉన్నతాధికారుల ఫోన్లను ట్యాపింగ్ చేశారనే కేసులో సస్పెండైన మాజీ అదనపు ఎస్పీ భుజంగరావు, మాజీ ఓఎస్డీ పీ రాధాకిషన్‌రావుకు హైకోర్టు గురువారం షరతులతో కూడిన బెయిలు మంజూరు చేసింది. లక్ష రూపాయల వ్యక్తిగత పూచీకత్తుతోపాటు అంతే మొత్తానికి మరో రెండు జామీనులపై బెయిల్ మంజూరు చేసింది. పాస్‌పోర్టును కింది కోర్టులో అప్పగించాలని, ఎనిమిది వారాలపాటు ప్రతి సోమవారం దర్యాప్తు అధికారి ఎదుట హాజరుకావాలని, సాక్షులను ప్రభావితం చేయకూడదని సూచించింది. పోలీసుల దర్యాప్తుతోపాటు కోర్టు విచారణకు సహకరించాలని షరతులు విధిస్తూ న్యాయమూర్తి జస్టిస్ కే సుజన గురువారం వేర్వేరుగా తీర్పులు వెలువరించారు. హైకోర్టు తీర్పు వెలువరించడానికి ఒక్కరోజు ముందు పోలీసుల తరఫున పబ్లిక్ ప్రాసిక్యూటర్ పల్లె నాగేశ్వరరావు సీల్డ్ కవర్‌లో దర్యాప్తు అధికారుల నివేదికను ధర్మాసనానికి అందజేశారు. మరో 19 మంది హైకోర్టు న్యాయమూర్తులపై కూడా నిందితులు నిఘా పెట్టారని, దర్యాప్తు జరుగుతున్నందున బెయిల్ ఇవ్వొద్దని కోరారు. దీనిపై న్యాయమూర్తి తన తీర్పులో.. జడ్జీల వివరాలతో పబ్లిక్ ప్రాసిక్యూటర్ సీల్డ్ కవర్లో నివేదిక అందజేశారని తెలిపారు. ఈ నివేదికపై పిటిషనర్ తరఫు న్యాయవాది ఈ ఉమామహేశ్వరరావు తీవ్ర అభ్యంతరం చెప్పారు. ఇవే విషయాలను సుప్రీంకోర్టులో చెప్పారని, తిరుపతన్న కంప్యూటర్‌లో ప్రొఫైల్స్ ఉన్నాయన్న నెపంతో వారి ఫోన్ల ట్యాపింగ్‌కు పిటిషనర్లు ప్రయత్నించారని చెప్పడం అన్యాయమని అన్నారు. ఇవన్నీ చెప్పినప్పటికీ ఇదే కేసులో నిందితుడు తిరుపతన్నకు సుప్రీంకోర్టు బెయిల్ ఇచ్చిందని గుర్తుచేశారు. సుమారు 10 నెలలకుపైగా పిటిషనర్లు జైలులో ఉన్నారని, విచారణ ప్రక్రియ ఇప్పట్లో మొదలుకాదని, సుదీర్ఘ కాలం నిర్బంధంలో ఉంచడం హక్కులను హరించడమేనని చెప్పారు. ఇరుపక్షాల వాదనల తర్వాత హైకోర్టు, ఇద్దరు నిందితులకు షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసింది. ఇదిలా ఉండగా, ఇదే కేసులో మరో నిందితుడైన శ్రవణ్‌కుమార్ దాఖలు చేసిన ముందస్తు బెయిల్ పిటిషన్‌పై హైకోర్టు తీర్పు వెలువరించాల్సివుంది.

కట్టు కథలతో కేసులో ఇరికించారు..

ఫోన్‌ట్యాపింగ్ కేసులో రిటైర్డు పోలీసు అధికారి రాధాకిషన్‌రావును, అదనపు రిటైర్డు ఎస్పీ ఎన్ భుజంగరావును అన్యాయంగా ఇరికించారని వాళ్ల తరఫు న్యాయవాది ఉమామహేశ్వరరావు వాదించారు. అక్రమంగా కేసు పెట్టి, అన్యాయంగా ఈ కేసులో ఇరికించి, చట్టవిరుద్ధంగా రిమాండుకు తరలించారని తెలిపారు. అరెస్టుకు కారణాలను పేర్కొనలేదన్నారు. ఇప్పటికే కేసు దర్యాప్తులో భాగంగా పోలీసులు అన్ని ఆధారాలను సేకరించారని గుర్తుచేశారు. అన్నీ కోర్టు పర్యవేక్షణలోనే ఉన్నందున బెయిల్ ఇవ్వాలని కోరారు. ఫోన్‌ట్యాపింగ్ కేసులో 2024, మార్చిలో భుజంగరావు, రాధాకిషన్‌రావును పోలీసులు అరెస్టు చేశారని, బెయిల్ పొందే చట్టబద్ధమైన హక్కు వారికి ఉందని అన్నారు. గత ప్రభుత్వ పెద్ద ఫోన్‌ట్యాపింగ్ వ్యవహారం వెనుకున్నారని పోలీసులు చెప్తున్నా అది ఎవరో పేరు వెల్లడించలేదని చెప్పారు. ఫోన్ ట్యాపింగ్ బెదిరింపుల వల్ల ఇతర పార్టీల నుంచి బీఆర్ఎస్‌లో చేరిన వారుగానీ, తమ వద్ద డబ్బు వసూలు చేశారని ఆరోపించిన బాధితులుగానీ ఎవరూ లేరని తెలిపారు. ఇదంతా పోలీసులు అల్లిన కట్టుకథ అని చెప్పారు. భుజంగరావు ఆరోగ్య పరిస్థితి బాలేదని, జైలుకు పంపితే ఆరోగ్యం మరింత క్షీణించే ప్రమాదం ఉందన్నారు.

'పాలమూరు'కు పవర్‌కట్!

మొదటిపేజీ తరువాయి...

స్టేషన్‌లో 9 పంపులను ఏర్పాటు చేశారు. ఇవి డ్రై రన్ కోసం సిద్ధంగా ఉన్నాయి. ఇప్పటికే పంపింగ్ స్టేషన్-1(నార్లాపూర్) పంపులను డ్రైరన్, వెట్‌రన్ విజయవంతంగా నిర్వహించారు. ఏదుల, వట్టెం పంపులను డ్రైరన్, వెట్‌రన్ కోసం అధికారులు సిద్ధంచేశారు. ఆయా పంపింగ్ స్టేషన్లకు విద్యుత్తు కనెక్షన్ లేకపోవడంతో ఆ ప్రక్రియను చేపట్టలేకపోతున్నారు. మోటర్ల పనితీరును పరీక్షించేందుకు, విడిభాగాలను సంరక్షించేందుకు, పంపులను తిప్పి చూడటం పరిపాటి. అందుకు డ్రైరన్ నిర్వహించాల్సి ఉంటుంది. అందులో ఏవైనా లోపాలు ఉంటే గుర్తించి, వాటి మరమ్మతులను మోటర్లను సరఫరా చేసిన ఏజెన్సీలతోనే చేయించాల్సి ఉంటుంది. అన్నీ సిద్ధమైన తరువాత వెట్‌రన్ నిర్వహిస్తారు. ఆయా ఎత్తిపోతల పథకాల్లో మోటర్ల అమరిక పూర్తయినా డ్రైరన్ నిర్వహించేందుకు నెలలుగా ఎదురు చూస్తున్నారు. ఈ ఏడాది వర్షాకాలంలో వట్టెం పంప్‌హౌజ్ వరదతో మునిగిపోయింది. అప్పటికే సిద్ధం చేసిన నాలుగు పంపులు నీటిలో మునిగిపోగా, వాటిలో రెండింటిని ఇటీవల పునరుద్ధరించారు. ఆ పంపుల పనితీరును కూడా పరిశీలించాల్సి ఉన్నది. అయితే, ప్రాజెక్టులోని అన్ని పంపింగ్ స్టేషన్లకు పవర్ సర్వీస్ కనెక్షన్‌ను విద్యుత్తు శాఖ కట్ చేసింది. రూ.500 కోట్ల మేర బకాయి బిల్లులను చెల్లిస్తేనే విద్యుత్తు కనెక్షన్ ఇస్తామని ఎస్‌పీడీసీఎల్, టీఎస్ ట్రాన్స్‌కో అధికారులు ఇరిగేషన్ శాఖకు తేల్చిచెప్పారు. ఆ బిల్లులు చెల్లించాలని ఇరిగేషన్ అధికారులు ప్రభుత్వానికి ఏడాదిగా మొరపెట్టుకుంటున్నారు. సర్వీస్ కనెక్షన్ చార్జీలు చెల్లించాలని, మోటర్లను తిప్పి చూడాల్సి ఉన్నదని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తూ వస్తున్నారు. అయిప్పటికీ, ప్రభుత్వం మాత్రం బిల్లులను చెల్లించేందుకు ససేమిరా అంటున్నదని అధికారులు వాపోతున్నారు. పంపులను సరఫరా చేసిన ఏజెన్సీల అగ్రిమెంట్ పూర్తికాక ముందే డ్రైరన్, వెట్‌రన్ నిర్వహించాల్సి ఉంటుందని, అప్పుడే ఏవైనా లోపాలు తలెత్తినా, మరమ్మతులు చేయాల్సి ఉన్నా సదరు ఏజెన్సీతోనే చేయించే అవకాశం ఉంటుందని చెప్తున్నారు. ప్రభుత్వం వెంటనే ట్రాన్స్‌కోకు నిధులు చెల్లించి పంపింగ్ స్టేషన్లకు సర్వీస్ కనెక్షన్ ఇప్పించాలని అధికార వర్గాలు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నాయి.

అమ్ముడుపోని ఫ్లాట్లు.. బిల్డర్ ఆత్మహత్య

మొదటిపేజీ తరువాయి...

పరిధిలోని కొంపల్లిలో నివాసముంటున్న ముత్యాల వేణుగోపాల్‌రెడ్డి (39) అనే బిల్డర్ ఆర్థిక ఇబ్బందులతో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు.

ఏడాదిలోనే సంక్షోభం

సిరిసిల్ల జిల్లాలోని గోపాలపురం గ్రామానికి చెందిన ముత్యాల ఏసురెడ్డి అల్వాల్‌లో స్థిరపడ్డారు. చాలా ఏండ్లుగా రియల్ ఎస్టేట్ వ్యాపారంలో ఉన్నారు. ఆయన ఏకైక కుమారుడు వేణుగోపాల్‌రెడ్డి ఎనిమిదేండ్లుగా అదే రంగంలోకి పనిచేస్తున్నాడు. మిత్రులతో కలిసి కొంపల్లిలో అపార్టుమెంట్ నిర్మాణం చేపట్టి, విజయవంతంగా అమ్మకాలు పూర్తిచేశారు. వేణుగోపాల్‌రెడ్డి భార్య ప్రణయ, కూతురు ఆద్యతో కలిసి ఆ అపార్టుమెంట్‌లోనే సొంత ఫ్లాటులో ఉంటున్నారు. అల్వాల్‌లోనూ మిత్రులతో కలిసి వేణుగోపాల్‌రెడ్డి నిర్మాణాలు చేపట్టారు. ఈ క్రమంలో వేణుగోపాల్‌రెడ్డి తన కూతురు ఆద్య పేరిట ఒక నిర్మాణ ప్రాజెక్టు చేపట్టాలని నిర్ణయించుకున్నారు. రెండేండ్ల క్రితం గుండ్లపోచంపల్లిలో 480 చదరపు గజాల విస్తీర్ణంలో ఐదంతస్తుల అపార్టుమెంటు నిర్మాణం మొదలుపెట్టారు. ఇందుకు పలు బ్యాంకుల నుంచి, ప్రైవేటు వ్యక్తుల వద్ద అప్పులు చేశారు. ప్రస్తుతం అపార్టుమెంట్ నిర్మాణం చివరి దశలో ఉంది. ఈ అపార్టుమెంట్‌లో పది ఫ్లాట్లు అమ్మితే అప్పులన్నీ తీరడంతో పాటు ఆర్థికంగా లాభపడతానని ఆశించారు. కానీ ఏడాది నుంచి ప్రయత్నిస్తున్నా మూడు ఫ్లాట్లు మాత్రమే బుక్ అయ్యాయి.

రియల్ పతనం.. దారుణం!

కొన్నిరోజులుగా రియల్ ఎస్టేట్ రంగంలో స్తబ్ధత నెలకొనడంతో ఫ్లాట్ల విక్రయం పూర్తిగా నిలిచిపోయిందని వేణుగోపాల్‌రెడ్డి కుటుంబ సభ్యులు తెలిపారు. వారం రోజులుగా ఆర్థిక ఇబ్బందుల వల్ల ఒత్తిడి మరింత పెరిగిందని చెప్పారు. బుధవారం సాయంత్రం తన అపార్టుమెంట్ నిర్మాణం వద్ద ఏర్పాటు చేసుకున్న కార్యాలయంలోనే వేణుగోపాల్‌రెడ్డి ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డారు. వేణుగోపాల్‌రెడ్డి సూసైడ్ నోట్ కూడా రాశారని, అందులో తాను చేసిన అప్పులు తీర్చలేకనే ఆత్మహత్యకు పాల్పడుతున్నట్లుగా పేర్కొన్నారని కుటుంబ సభ్యులు పోలీసులు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పేట్‌బషీర్‌బాగ్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

హాల్‌టికెట్ లేకుండా పరీక్షకు అనుమతి

- లేటుగా ఫీజు చెల్లించిన 128 మంది
- వారికి పర్మిషన్ ఇచ్చిన బోర్డు

హైదరాబాద్, జనవరి 30 (నమస్తే తెలంగాణ): హాల్‌టికెట్ లేకుండా 128 మంది విద్యార్థులకు పరీక్ష రాయడానికి అనుమతి ఇచ్చినట్టు తెలంగాణ ఇంటర్మీడియట్ బోర్డు వెల్లడించింది. ఈ అంశంపై వివిధ మీడియా ఛానళ్లలో వచ్చిన వార్తలకు గురువారం ఓ ప్రకటనలో వివరణ ఇచ్చింది. సాధారణ విద్యార్థులు 4,40,931 మంది, వృత్తి విద్యా విద్యార్థులు 50,056 మందికి గురువారం పర్యావరణ విద్యా పరీక్ష రాయడానికి అనుమతించినట్టు వెల్లడించింది. ఇందులో 128 మంది విద్యార్థులు ఈ నెల 29 రాత్రి పరీక్ష ఫీజు చెల్లించడానికి అనుమతి పొందారని పేర్కొన్నది. విద్యార్థుల భవిష్యత్తు దృష్ట్యా, కాలేజ్ మేనేజ్‌మెంట్లు, తల్లిదండ్రులు, విద్యార్థుల అభ్యర్థనలను పరిగణనలోకి తీసుకుని వారికి హాల్‌టికెట్ లేకుండా పరీక్ష రాయడానికి అనుమతించినట్టు తెలిపింది.

కుంభమేళాలో టీటీడీ ఉద్యోగి అదృశ్యం

హైదరాబాద్, జనవరి 30 (నమస్తే తెలంగాణ) : మహాకుంభ మేళాలో టీటీడీ ఉద్యోగి ఒకరు అదృశ్యమయ్యాడు. టీటీడీ ఆధ్వర్యంలో శ్రీవారి నమూనా ఆలయాన్ని ప్రయాగ్‌రాజ్‌లో ఏర్పాటు చేసి, విధి నిర్వహణకు 200 మంది ఉద్యోగులు, సిబ్బందిని పంపించారు. ప్రారంభం నుంచి అక్కడే ఉన్న దీవేటి సుబ్రహ్మణ్యం అనే ఉద్యోగి బుధవారం నుంచి కనిపించడం లేదు. దీంతో స్థానిక పోలీసులకు, టీటీడీ ఈవోకు ఉద్యోగులు సమాచారం అందించారు.

శ్రీవారిని దర్శించుకున్న మాజీ గవర్నర్..

మహారాష్ట్ర మాజీ గవర్నర్ విద్యాసాగర్ రావు గురువారం శ్రీవారిని దర్శించుకున్నారు. అనంతరం రంగనాయకుల మండపంలో అర్చకులు తీర్థప్రసాదాలు అందజేసి, శాలువతో సన్మానించారు. కాగా, తిరుపతికి చెందిన బ్లిస్ హోటల్స్ గ్రూప్ చైర్మన్ ఎం సూర్యనారాయణరెడ్డి దంపతులు టీటీడీ ట్రస్టుకు రూ.10,00,116 విరాళాన్ని అందజేశారు.

ఆర్టీసీ ఉద్యోగులు ఆగమాగం..!

- 'మహాలక్ష్మి'తో కార్మికులపై ఒత్తిడి
- మెమోల జారీ, సస్పెన్షన్లు
- 417 మంది ఉద్యోగులపై వేటు
- 16 గంటలకు పెరిగిన పనివేళలు
- ఇప్పటికైనా యాజమాన్యం స్పందించకపోతే సమ్మె తప్పదు
- ఆర్టీసీ కార్మికుల హెచ్చరిక

హైదరాబాద్ సిటీబ్యూరో, జనవరి 30 (నమస్తే తెలంగాణ): 'వద్దు బాబోయ్ మాకీ ఉద్యోగాలు.. మేం ఒత్తిడితో కుంగిపోతున్నాం' అంటూ టీజీఎస్‌ఆర్టీసీ కార్మికుల ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం మహాలక్ష్మి పథకం కింద మహిళలకు ఉచిత బస్సు ప్రయాణాన్ని ప్రారంభించినప్పటి నుంచి నరకం చూస్తున్నామని వారు వాపోతున్నారు. సరైన కారణం లేకుండానే మెమోలు జారీ చేస్తూ, సస్పెండ్ చేస్తున్నారని మండిపడుతున్నారు. యాజమాన్యం అనవసరమైన కారణాలతో తమను వేధిస్తున్నదని ఆరోపిస్తున్నారు. ఉచిత బస్సు ప్రయాణం మొదలైనప్పటి నుంచి ఇప్పటివరకు సుమారు 417 మంది డ్రైవర్లు, కండక్టర్లు సస్పెండ్ అయ్యారు. మరికొందరికి మెమోలు జారీ చేశారు. ఉచిత బస్సు పథకానికి టికెట్ జారీచేయాలంటే ఆధార్ కార్డ్ నంబర్ తప్పనిసరి. మహాలక్ష్మి పథకం కారణంగా బస్సులు కిక్కిరిసిపోతున్నాయని, ఈ క్రమంలో టికెట్ జారీ చేయడం సవాల్ మారిందని కండక్టర్లు చెప్తున్నారు. రాత్రిపూట విధి నిర్వహణ తమకు నరకం కన్నా ఘోరంగా ఉన్నదని ఆ మహిళా కండక్టర్ ఆవేదన వ్యక్తంచేశారు. పనిభారాన్ని తట్టుకోలేక శారీరక, మానసిక రుగ్మతలకు గురై దవాఖానల చుట్టూ తిరగాల్సి వస్తుందని పేర్కొన్నారు. స్పెషల్ ఆఫ్ డ్యూటీ స్థానంలో సింగిల్ క్రూతో 14 నుంచి 16 గంటలు డ్యూటీలు చేయిస్తున్నారని తెలిపారు. ఈ నేపథ్యంలోనే తమ సమస్యల పరిష్కారం కోరుతూ సమ్మె నోటీసు ఇచ్చామని యూనియన్ నాయకుడొకరు వెల్లడించారు.

పనిభారం..ప్రయోజనం శూన్యం..!

రాష్ట్రంలో 41 వేల మంది ఆర్టీసీ కార్మికులు ఉన్నారు. ఉచిత బస్సు ప్రయాణ పనిభారాన్ని మోస్తున్న ఆర్టీసీ కార్మికులను ప్రభుత్వం చిన్నచూపు చూడటం సరైంది కాదని పలువురు కార్మికులు విమర్శించారు. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో ఉచిత బస్సు పథకం అమలుకు ముందువరకు ప్రతిరోజు దాదాపు 2,600 బస్సుల్లో సగటున 11 లక్షల మంది ప్రయాణించేవారు. వీరిలో మహిళా ప్రయాణికులు 5 లక్షల మంది ఉండేవారు. మహాలక్ష్మి పథకంఅందుబాటులోకి వచ్చాక ఇప్పుడు రోజుకు సగటున 24 లక్షల మంది ప్రయాణిస్తుండగా, వీరిలో 17 లక్షల మంది మహిళలే ఉంటున్నారు. ప్రయాణికులకు తగిన రీతిలో బస్సుల సంఖ్యను పెంచకపోవడంతో రద్దీ పెరిగిపోతున్నది. ఈ క్రమంలో టికెట్లు జారీ చేయడం, ఆధార్ నంబర్లను సేకరించడం కత్తిమీద సాములాంటిదేనని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ఇదే క్రమంలో నగరంలో రోడ్లపై ట్రాఫిక్ భారీగా పెరిగిపోయింది. వేల సంఖ్యలో చిన్న, పెద్ద వాహనాల నడుమ, బస్‌స్టాప్‌లు, ట్రాఫిక్ సిగ్నళ్లను అధిగమిస్తూ ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చడం డ్రైవర్లకు కూడా కత్తిమీద సాము వంటిదేనని నిపుణులు పేర్కొంటున్నారు. ఇంత చేస్తున్నా.. చిన్నచిన్న కారణాలకు వాళ్లను సస్పెండ్ చేస్తున్నారని వాపోతున్నారు.

కొన్ని డిమాండ్స్..!

- ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా జీతాలు ఇవ్వాలి. 2017 వేతన సవరణ బకాయిలను చెల్లించి రిటైర్డ్ ఉద్యోగులకు కూడా అమలు చేయాలి.
- ఎంటీడబ్ల్యూ యాక్ట్ ప్రకారం 8 గంటల పనిదినాలు (సిటీ సర్వీసులలో 7 గంటలు) అమలు చేసి మహిళా కండక్టర్లకు రాత్రి 8 గంటల లోపున డ్యూటీలు పూర్తయ్యేలా చూడాలి. ప్రతి కార్మికునికి నెలకు 3 రోజులు సెలవులు మంజూరు చేయాలి.
- మహాలక్ష్మి పథకంలో జీరో టికెట్ బదులు మహిళలకు స్మార్ట్‌కార్డు ఇవ్వాలి. రద్దీకనుగుణంగా బస్సుల సంఖ్య పెంచాలి. ఈ స్కీమ్‌లో జరుగుతున్న సీఅండ్‌టీ కేసులలో మానవతా దృక్పథంతో వ్యవహరించాలి.
- చికిత్స తీసుకుంటున్న కార్మికులకు, వారి అటెండర్స్‌కు భోజన, వసతి సౌకర్యం కల్పించాలి.
- సంస్థ అప్పులను ప్రభుత్వమే టేకోవర్ చేసి రాయితీలకు, సంస్థ అభివృద్ధికి ప్రతీయేటా బడ్జెట్‌లో 3 శాతం కేటాయించాలి. విద్యుత్తు బస్సులను ప్రభుత్వమే కొనుగోలు చేసి ఆర్టీసీకి ఇవ్వాలి.

అభయ హస్తం హామీల పరిష్కారమెప్పుడు?

ప్రభుత్వంలో ఆర్టీసీ కార్మికుల విలీనం ప్రక్రియను పూర్తి చేసి, రెండు పీఆర్‌సీ బకాయిలు వెంటనే చెల్లిస్తామని చెప్పారు. వచ్చే పీఆర్‌సీ పరిధిలోకి టీజీఎస్‌ఆర్‌టీసీ కార్మికులను చేరుస్తామన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా అన్ని వసతులు, సదుపాయాలు కల్పిస్తామని నమ్మించారు. ఆర్టీసీలో యూనియన్ల పునరుద్ధరణకు అనుమతి స్తామని కూడా మాటిచ్చారు. ఇప్పుడు ఈ హామీలన్నీ రాజకీయ లబ్ధి కోసమే ఇచ్చినట్టు అర్థమవుతుంది. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి ఆర్టీసీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలి. సమ్మె నోటీసులు ఇచ్చాం. స్పందించకపోతే సమ్మెకు దిగుతాం.

-ఎం థామస్ రెడ్డి, టీజీఎస్‌ఆర్టీసీ జాక్ నాయకులు

మార్చిలోనే స్థానిక ఎన్నికలు?

- ఫిబ్రవరి 7న అసెంబ్లీ ఒక్కరోజు ప్రత్యేక సమావేశం?
- కులగణన సర్వే ఆమోదం కోసం ప్రభుత్వం కసరత్తు
- స్థానిక సంస్థల ఎన్నికల కోసమే రేవంత్‌రెడ్డి చర్యలు

హైదరాబాద్, జనవరి 30 (నమస్తే తెలంగాణ): స్థానిక సంస్థల ఎన్నికల కోసం ప్రభుత్వం కసరత్తు వేగవంతం చేసినట్టు తెలుస్తున్నది. ఇందుకోసం బీసీ రిజర్వేషన్ల పెంపుపై దృష్టి సారించిందని సమాచారం. ఇందులో భాగంగా కులగణన సర్వే నివేదికను ఫిబ్రవరి 2న క్యాబినెట్ సబ్‌కమిటీకి అప్పగించాలని సీఎం రేవంత్ రెడ్డి బుధవారం అధికారులను ఆదేశించారు. ఈ మేరకు ఫిబ్రవరి 5న క్యాబినెట్ ప్రత్యేక సమావేశం నిర్వహించి, నివేదికను ఆమోదించనున్నట్టు తెలుస్తున్నది. ఆ తర్వాత ఫిబ్రవరి 7న ఒక్క రోజు శాసనసభ సమావేశం నిర్వహించి, కులగణన సర్వే నివేదికను ఆమోదింపజేయాలని భావిస్తున్నట్టు సమాచారం. సీఎం రేవంత్ రెడ్డి ఇటీవలే గవర్నర్ జిష్ణుదేవ్ వర్మతోనూ చర్చించి, సమావేశానికి అనుమతి తీసుకున్నట్టు సచివాలయ వర్గాలు తెలిపాయి. అసెంబ్లీ ఆమోదం తర్వాత తదుపరి కసరత్తు పూర్తి చేసి, మార్చిలో స్థానిక సంస్థల ఎన్నికలకు వెళ్లాలని ప్రభుత్వం భావిస్తున్నట్టు ప్రభుత్వవర్గాల సమాచారం. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ మార్చి మొదటి వారం వరకు అమల్లో ఉంటుంది. దీన్నే కొనసాగిస్తూ మార్చి రెండో వారంలో స్థానిక సంస్థల ఎన్నికల షెడ్యూల్ విడుదల చేయాలని ప్రభుత్వం భావిస్తున్నట్టు తెలుస్తున్నది.

పోలీస్ ఆఫీసర్ల సంఘానికి ఎన్నికలు నిర్వహించండి

డీజీపీకి హైకోర్టు ఆదేశం

హైదరాబాద్, జనవరి 30 (నమస్తే తెలంగాణ): తెలంగాణ పోలీస్ అధికారుల అసోసియేషన్‌కు ఐదు వారాల్లో ఎన్నికలు నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలని డీజీపీని హైకోర్టు ఆదేశించింది. ఇదే హైకోర్టు 2016లో జారీచేసిన ఉత్తర్వులను అమలు చే యాలని 2023 మే 10న పిటిషనర్ జనార్దన్ వినతిపత్రాన్ని పరిగణనలోకి తీసుకోవాలని సూచించింది.

ఐఎంఎస్ ఉద్యోగులపై 'కార్పొరేషన్' కత్తి

- కార్పొరేషన్ ఏర్పాటుకు ప్రభుత్వం కసరత్తు
- అగమ్యగోచరంగా ఉద్యోగుల పరిస్థితి
- ప్రభుత్వంలోనే కొనసాగించాలని డిమాండ్
- డిప్యూటేషన్లపై కార్పొరేషన్‌లో చేస్తామని వేడుకోలు

హైదరాబాద్, జనవరి 30 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలోని లక్షలాది మంది కార్మికుల ఆరోగ్య పరిరక్షణలో కీలక పాత్ర పోషిస్తున్న 'ఇన్సూరెన్స్ మెడికల్ సర్వీసెస్' (ఐఎంఎస్) ఉద్యోగులపై 'కార్పొరేషన్' కత్తి వేలాడుతున్నది. రాష్ట్ర కార్మిక శాఖ పరిధిలో ఉన్న ఐఎంఎస్‌లో ప్రస్తుతం 2,500 మంది ఉద్యోగులు పనిచేస్తున్నారు. ఐఎంఎస్ కింద ఉన్న నాలుగు దవాఖానలు, రెండు డయాగ్నొస్టిక్ సెంటర్లు, 73 డిస్పెన్సరీలు ఉండగా.. గుర్తింపు పొందిన కార్మికులు, వారి కుటుంబాలు, 19.5 లక్షల ఈఎస్‌ఐ కార్డుదారులు, మొత్తంగా 70 లక్షల మందికి వీరు సేవలందిస్తున్నారు. అయితే, ప్రభుత్వ ఆధ్వర్యంలో పనిచేస్తున్న ఐఎంఎస్‌ను కార్పొరేషన్‌గా మార్చేందుకు కేంద్ర, రాష్ట్ర కార్మిక శాఖల అధికారులు ఢిల్లీలో గురువారం సమావేశమయ్యారు. ఈ నేపథ్యంలో కార్పొరేషన్‌గా మార్చుతూ త్వరలో ఉత్తర్వులు వెలువడే అవకాశం ఉన్నట్టు సమాచారం.

మా సంగతేమిటి?

ఐఎంఎస్‌ను కార్పొరేషన్‌గా మారిస్తే తమకు అభ్యంతరం లేదని కానీ, ప్రభుత్వ ఉద్యోగులుగా కొనసాగించడంపై స్పష్టత ఇవ్వడం లేదని వాపోతున్నారు. ప్రభుత్వ ఉద్యోగులుగా నియామకమై, దశాబ్దాలుగా కొనసాగుతున్న తమను కార్పొరేషన్ ఉద్యోగులుగా మారిస్తే ఉద్యోగ భద్రత ఉండదని, రిటైర్మెంట్ ప్రయోజనాలు దక్కవని ఆవేదన చెందుతున్నారు. తమను కార్మిక శాఖ లేదా వైద్యారోగ్య శాఖ పరిధిలోకి తీసుకోవాలని, ఆ తర్వాత డిప్యూటేషన్‌పై కార్పొరేషన్‌లో కొనసాగించాలని పేర్కొంటున్నారు. మహారాష్ట్ర తదితర మూడు రాష్ట్రాల్లో ఉద్యోగులను ఇతర శాఖల్లోకి తీసుకొని, డిప్యూటేషన్‌పై కార్పొరేషన్‌లో కొనసాగిస్తున్నారని పేర్కొంటున్నారు. అదే తరహాలో తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

సచివాలయంలో నకిలీ ఉద్యోగి

- రెవెన్యూ శాఖ ఉద్యోగిగా నకిలీ ఐడీ కార్డు
- ఇద్దరిని అరెస్ట్ చేసిన పోలీసులు

హైదరాబాద్, జనవరి 30 (నమస్తే తెలంగాణ): కట్టుదిట్టమైన భద్రత ఉండే సచివాలయంలో ఓ నకిలీ ఉద్యోగి పట్టుబడ్డాడు. ఆ వ్యక్తి రెవెన్యూ శాఖలో ఉద్యోగిగా నకిలీ గుర్తింపు కార్డు సృష్టించుకొని, కొంతకాలంగా చలామణి అవుతున్నాడు. చివరికి ఆ నకిలీ ఉద్యోగిని ఎస్పీఎఫ్ ఇంటెలిజెన్స్ ఏఎస్సై యూసుఫ్, హెడ్ కానిస్టేబుల్ ఆంజనేయులు పట్టుకున్నారు. నకిలీ ఉద్యోగిపై సైఫాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్పీఎఫ్ కథనం ప్రకారం.. ఈ నెల 28న సీఎం రేవంత్‌రెడ్డి సచివాలయంలో మీడియా సమావేశం నిర్వహించారు. అనంతరం బయటికి వచ్చి అధికారులతో మాట్లాడుతుండగా తడికమళ్ల భాస్కర్‌రావు సీఎం, ఉన్నతాధికారులు కనిపించేలా సెల్ఫీలు తీసుకునేందుకు ప్రయత్నించాడు. దీంతో అక్కడే ఉన్న ఎస్పీఎఫ్ ఏఎస్సై రాంబాబు కు అనుమానం వచ్చి, అతడిని పిలిచి విచారించారు. సంబంధం లేకుండా సమాధానాలు ఇవ్వడంతో సీఎస్‌వో కార్యాలయానికి తీసుకెళ్లారు. భాస్కర్ రావుది ఖమ్మం జిల్లా కామేపల్లి మండలం ముచ్చెర్ల గ్రామంగా గుర్తించారు. అతడి దగ్గర విజిటర్స్ పాస్ కూడా లేకపోవడంతో అతడి జేబులు, పర్సు వెతకగా ప్రభుత్వ ఉద్యోగి ఐడీ కార్డు లభించింది. అందులో రెవెన్యూశాఖలో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నట్టుగా ఉంది. ఐడీ కార్డుపై అనుమానం రావడంతో ఎస్పీఎఫ్ ఇంటెలిజెన్స్ పోలీసుల ద్వారా రెవెన్యూ శాఖలో ఆరా తీయగా అలాంటి ఉద్యోగి లేడని తేలింది. తాను నకిలీ ఐడీ కార్డుతో కొన్నాళ్లుగా సచివాలయంలోకి వచ్చి వెళ్తున్నట్టు ఒప్పుకున్నాడు. పోలీసుల విచారణలో.. మైనార్టీ సంక్షేమ శాఖలోని ఓ అధికారి దగ్గర డ్రైవర్‌గా పనిచేస్తున్న రవి అనే వ్యక్తి భాస్కర్‌రావుకు నకిలీ ఐడీ కార్డు తయారు చేసి ఇచ్చినట్టు ఇంటెలిజెన్స్ వర్గాలు గుర్తించాయి. రవిని సైతం పోలీసులు అరెస్ట్ చేసినట్టు తెలిసింది. వారిద్దరు కలిసి ఏయే అక్రమాలకు పాల్పడ్డారనే అంశంపై పోలీసులు ఆరా తీస్తున్నారు.

నో ఇన్సూరెన్స్... నో పెట్రోల్, డీజిల్!

- అన్ని వాహనాలకు ఇన్సూరెన్స్ తప్పనిసరి
- లేకపోతే నో పెట్రోల్, డీజిల్, ఫాస్టాగ్!
- త్వరలో అమల్లోకి కేంద్రం నిబంధనలు
- అవగాహన లేకపోతే నష్టపోవాల్సిందే!
- ప్రజలకు రవాణాశాఖ అధికారుల హెచ్చరిక

హైదరాబాద్, జనవరి 30 (నమస్తే తెలంగాణ): వాహనాలపై కేంద్ర ప్రభుత్వం కొత్త నిబంధనలు అమల్లోకి తీసుకొచ్చేందుకు సిద్ధమైంది. అన్ని వాహనాలకు థర్డ్ పార్టీ బీమా తప్పనిసరి చేసింది. బీమా లేకపోతే పెట్రోల్, డీజిల్ కొనుగోలు చేయలేరు. ఫాస్టాగ్ కోసం కూడా ఇన్సూరెన్స్ డాక్యుమెంట్లు చూపించాల్సి ఉంటుంది. లైసెన్స్ సర్టిఫికెట్‌లు పొందాలంటే కూడా బీమా తప్పనిసరి. ఇన్సూరెన్స్ లేకుండా డ్రైవింగ్ చేస్తూ పట్టుబడితే భారీ జరిమానా చెల్లించాల్సి ఉంటుంది. ఏదైనా ప్రమాదం జరిగినప్పుడు బీమా ఉంటే జరిగిన నష్టానికి పరిహారం పొందే వీలు కలుగుతుంది. ఇన్సూరెన్స్‌తో ఇతర ప్రయోజనాలు కూడా పొందవచ్చని అధికారులు చెప్తున్నారు. లేకపోతే చాలా నష్టాలు తప్పవని హెచ్చరిస్తున్నారు.

చట్టం ఏం చెప్తున్నది?

మోటారు వాహనాల చట్టం-1988 ప్రకారం అన్ని మోటారు వాహనాలకు తప్పనిసరిగా థర్డ్‌పార్టీ బీమా పాలసీ ఉండాలి. కానీ ఇన్సూరెన్స్ రెగ్యులేటరీ అండ్ డెవలప్‌మెంట్ అథారిటీ ఆఫ్ ఇండియా(ఐఆర్‌డీఏ) 2024లో దేశంలో 40 కోట్ల వాహనాలు ఉన్నాయని అంచనా వేస్తే అందులో దాదాపు 50 శాతం వాహనాలకు మాత్రమే బీమా ఉందని తెలుస్తున్నది. కొత్త నిబంధనల ప్రకారం బీమా లేకుండా వాహనం నడుపుతూ మొదటిసారి పట్టుబడితే రూ.2,000 జరిమానా లేదా మూడు నెలల జైలు శిక్ష లేదా రెండూ విధించవచ్చు. రెండోసారి పట్టుబడితే రూ.4,000 వరకు జరిమానా ఉంటుంది.

సర్వీస్ రూల్స్‌లో మార్పులు

వాహన సర్వీస్ రూల్స్‌లో మార్పులు చేసే ప్రతిపాదనలను కూడా కేంద్ర రవాణామంత్రిత్వశాఖ పరిశీలిస్తున్నట్టు తెలుస్తున్నది. వాహన సేవలను బీమా కవరేజీతో లింక్ చేసే అవకాశాలున్నాయి. ఈ కొత్త నిబంధనలను కచ్చితంగా పాటించేలా రాష్ట్ర ప్రభుత్వాలు, కేంద్ర పాలిత ప్రాంతాలకు ఆదేశాలు ఇవ్వనున్నట్టు రవాణాశాఖ వర్గాలు చెప్తున్నాయి.